అందరికీ ఉన్నట్లే అతనికీ ఒక ఫాంటసీ ఉంది. దాన్ని తీర్చుకోవటానికి తన కాబోయే భార్య సహకారం అడిగాడతను.ఆమె కూడా అంగీకరించింది.మరి అతని కోరిక తీరిందా?

# ఫాంటసి

స్వాతి వార పత్రికలో బహుమతి పొందిన కథ

పుట్టగంటి గోపీకృష్ణ

# ఫాంటసి



అది నా పెళ్ళి రోజు. సాంప్రదాయానికి ఆధునికత జోడించినట్లు ఉంది ఆ పెళ్ళిచూపుల దృశ్యం. పెద్దలందరు ముందు గదిలో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

రమ్య, నేను విడిగా పక్క గదిలో మాట్లాడుకుంటున్నాం.

రొటీన్‌కి విరుద్ధంగా పెళ్లికూతురు తల్లితండ్రుల కంటే మా అమ్మానాన్నలే టెన్షన్‌గా ఉన్నారు. వారి ఆందోళనకి కూడా కారణం ఉంది.

ఇది నాకు మొదటి పెళ్లిచూపులు కాదు. ఇప్పటివరకు ప్రతిసారీ మేమిలా పక్కరూములో మాట్లాడుకున్న కాసేపటికే విసవిసలాడుతూ ఆడపిల్ల మొహం ఎర్రగా చేసుకుని బయటకు రావటం, 'రిజల్ట్ తరువాత చెప్తాం...' అని చెప్పాలన్న సంస్కారం కూడా మరచిపోయి అక్కడికక్కడే, 'వీడు నాకొద్దు...' అని డిక్లేర్ చెయ్యటం మామూలయింది. కొండకచో 'వీడు' బదులు 'ఇడియట్', 'రోగ్' లాంటి విశేషణాలు వాడటం కూడా సర్వసాధారణమే అయింది. ఒకసారయితే లోపల నుండి 'ఛెళ్ళు' మన్న శబ్దం వినిపించింది కూడా! అది నా చెంప పేలిన శబ్దం అని మా అమ్మానాన్నల అభిప్రాయం. కాదని నేనిచ్చే కవరింగులు వారినెందుకు నమ్మించలేకపోతున్నాయో నాకు అర్థం కాదు.

ఈసారి ఎలాంటి హర్రర్ ఘటనలు చూడాలో అని భయపడుతున్న వారికి రిలీఫ్ కలగచేస్తూ గదిలో నుండి అమ్మాయి కంటే ముందు నేను బయటకొచ్చాను. నా మొహంలో ప్రతిఫలిస్తున్న ఆనందం చూసిన వారికి లోపల ఏం జరిగిందో డీటెయిల్‌గా తెలియక పోయినా, వెలుగుతోంది ఎర్రలైటు కాదని మాత్రం అవగతం అయింది. తరువాత బయటకు వచ్చిన రమ్య మొహం చూసిన వారికి ఆమె ఏ మాటా చెప్పక ముందే అది పెళ్లికి గ్రీన్ సిగ్నల్ అని తేటతెల్లమయింది.



మళ్లీ ఆలస్యం చేస్తే ఇంకెన్ని విఘ్నాలు వస్తాయో తెలియదు కాబట్టి అత్యంత వేగంగా ఆ పెళ్లి తంతు జరిపించి తమ గుండెల మీద కుంపటి దించుకున్నట్లు ఫీలయ్యారు మా అమ్మా నాన్నలు. నా పెళ్ళి చూపుల హిస్టరీ తెలిసిన రమ్య తల్లితండ్రులు ఆ కుంపటేదో తమ గుండెల మీదకి చేరుతుందేమో అని అనుమాన పడ్డారట కానీ, రమ్య ఇచ్చిన భరోసాతో కుదుట పడ్డారని తరువాత తెలిసింది.

"అమ్మాయిలు అంత అసహ్యించుకునేలా పెళ్ళిచూపుల్లో ఏం మాట్లాడుతున్నావురా?" అని ఎవరెంత అడిగినా నేను చెప్పటానికి ఇష్టపడలేదు. పెళ్ళికూతుర్లతో నాకున్న ఫాంటసీ గురించి చెప్పి అది సాకారం చేసుకోవటానికి వారి సహకారం అర్ధిస్తున్నానన్న విషయం నేనెవరికీ చెప్పలేదు. అసలామాట కొస్తే నేనామాట మళ్లీ రమ్య దగ్గర కూడా ఎత్తలేదు. పెళ్ళికి ముందే, తరువాత మాట్లాడుకోవటానికి ఏమీ మిగల కూడదేమో అన్నంత ఆత్రంగా సమస్త చెత్త వాగుడూ వాగినా, నా కోరిక గురించి మాత్రం మళ్లీ మాట్లాడలేదు నేను.

బంధుమిత్రుల సమక్షంలో పెళ్ళి, ఎవరూ లేని ఏకాంతంలో శోభనం ఏర్పాట్లు మామూలుగా జరిగిపోయాయి.

వయసు వేడితో మా తొలి సమాగమం ఎక్కువ మాటలకు అవకాశం లేకుండా జరిగిపోయింది. అలిసిపోయి పడుకున్న నాకు తెల్లవారుజామున మెలకువ వచ్చింది. బయట వాతావరణానికి విరుద్ధంగా ఏ.సీ. గాలికి గదంతా చల్లబడి ఉంది. మందపాటి దుప్పటి కింద ఆదమరచి నిద్రపోవలసిన ఆ సమయంలో ఎందుకు మెలకువ వచ్చిందో పరిశీలించిన నాకు నా గుండెల మీద సున్నాలు చుడుతున్న రమ్య కనిపించింది.

ఆమె నా గుండెల మీద పడుకుని నన్ను నిద్ర లేపటానికి ప్రయత్నిస్తోంది. విడివడిన నల్లని కురుల మధ్య మెరుస్తున్న ఆమె మోము చీకట్లో చంద్రబింబంలా ఉంది.



నా నిద్ర ఒక్కసారిగా ఎగిరిపోయింది.

నా వైపు చూస్తున్న రమ్యను, నా శరీరానికి తగులుతున్న ఆమె మెత్తని అందాలను, ఆమె నుండి వస్తున్న పరిమళాన్నీ ఆకళింపు చేసుకున్న నాలో మరలా ఏదో అలజడి. గట్టిగా ఆమెను హత్తుకుని పైకి లాక్కోబోయాను.

వారించింది రమ్య. "ఆగండాగండి. మళ్లీ ఆ గొడవలో పడితే అసలు విషయం వెనుక పడుతుంది..." అంది.

"ఈరోజు ఇదే అసలు విషయం. ఇది కాక ఇంకేముంటుంది..." చేతుల్ని దుప్పటి కింద నుండి పోనిస్తూ అన్నాను.

అంతే లాఘవంగా ఆ చేతుల్ని అక్కడ నుండి తొలగించి, "ముందు నాకొక మాట చెప్పండి. పెళ్ళిచూపుల రోజు నన్నొకటి అడిగారు కదా, మళ్లీ ఆ విషయం తరువాత ఎత్తలేదే?" అని అడిగింది.

"మాటమాటకీ అడిగేదేముంది? నువ్వు దానికి ఒప్పుకున్నావు కదా!"

"అయినా సరే! ఆ రోజు చెప్పింది మరలా చెప్పరా..." గారంగా అడిగింది.

"ఎందుకు? అప్పుడు సరిగ్గా వినలేదని వంకపెట్టి, ఇప్పుడు కుదరదనటానికా?" కోపంగా అన్నాను.

"అదేమీ కాదులేవోయ్! ఆ మాటలు నీ నోటి నుండి మళ్ళీ వినాలని తప్ప, మాటిచ్చి వెనక్కి వెళ్లటం నాకూ తెలియదు."

"అయినా, ఇప్పుడా?..." ఇంకేదో చేయాలని తొందర పెడుతున్న మనసును మాటలు చెప్పటం అనే ప్రక్రియ మీదకి మరల్చటానికి కష్టపడుతూ అన్నాను.

"ప్లీజ్!... ప్లీజ్!!..." బ్రతిమలాడింది రమ్య.

నిట్టూర్చి... ఇక తప్పదని నా ఫాంటసీ గురించి ఆమెకు మరొకసారి చెప్పటం మొదలు పెట్టాను.

"ప్రతి మనిషికీ ఫాంటసీలు ఉంటాయి. కాకపోతే ఆ విషయం కొందరు ఒప్పుకుంటారు. మరి కొందరు ఒప్పుకోరు. నా ఫాంటసీ గురించి చెప్పే ముందు అసలు అది ఎలా ఏర్పడిందో చెప్తాను.



అప్పుడు నాకు పన్నెండేళ్లు ఉంటాయి. స్కూలు తరుపున టూరుకు ముంబయ్ వెళ్లాం. ఆ రోజు అంధేరీ రైల్వే స్టేషన్‌కి వెళ్లాల్సి ఉంది. అక్కడకు చేరాలంటే మెయిన్ రోడ్ మీద నుండి దాదాపు పావు కిలోమీటర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీద నడవాల్సి ఉంటుంది.

అసలే ఆ రోజు ఆదివారం. పైగా వర్షా కాలం. అందులోనూ అప్పుడు వాన పడుతోంది. దానితో జనసంచారం ఉండీ లేనట్లు ఉంది. పేరుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి అయినా పది అడుగులకు పైగా వెడల్పు ఉండటంతో నడి రోడ్డు మీద నడుస్తున్నట్లే ఉంది. పైన కప్పిన ఫైబర్ రేకుల మధ్య నుండి రాలి పడలేని వర్షం తన కోపాన్ని చూపిస్తున్నట్లు దబదబ శబ్దం చేస్తోంది.

పిల్లలందరిలోనూ కాస్త పెద్దవాడినేమో, నలుగురితోనూ నడవటం నామోషీగా ఫీలయి, అందరికంటే ముందు వడివడిగా వెళ్తున్న నాకు, దూరంగా... ఒక పక్కగా, పైనున్న రేకులకు ఆధారంగా నిలబెట్టిన స్తంభానికి ఆనుకుని ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. అతను అటు తిరిగి ఉన్నాడేమో అతని వీపు మాత్రమే కనిపిస్తోంది. స్కై బ్లూ కలర్ టీషర్ట్ జీన్స్ పాంటులోకి టక్ చేసి ఉన్నాడు. బ్రౌన్ కలర్ బెల్టు రెండు నీలి రంగుల మధ్య వారధిలా ఉంది. తల పైన జుట్టు నీటుగా ట్రిమ్ చేసి ఉంది. విశాలంగా ఉన్న భుజాలు, టీ షర్టును ఉబికిస్తున్న కండలూ...ట్రిమ్‌గా ఉంచుకున్నది జుట్టునే కాదు, శరీరాన్ని కూడా అని తెలుపుతున్నాయి.

అతన్నే గమనిస్తూ ముందుకు నడుస్తున్న నాకు మరి కొన్ని అడుగులు వేయగానే అతను ఒంటరిగా లేడనీ, అతని ముందు ఒక అమ్మాయి నిలబడి ఉందనీ తెలిసింది. ఇద్దరూ ఏదో రహస్యం చెప్పుకుంటున్నట్లు ఒకరికొకరు దగ్గరగా నిలబడి ఉన్నారు.



మరికాస్త ముందుకు నడిచిన నేను షాక్ కొట్టినట్లు ఆగిపోయాను. వాళ్లు రహస్యం చెప్పుకోవటం లేదు. గాఢంగా ముద్దు పెట్టుకుంటున్నారు. వారి భంగిమ చూసి నా కాళ్లు ఎవరో ఇనుప గొలుసులతో కట్టేసినట్లు ఆగిపోయాను.

అతని ఎడమ చెయ్యి ఆమె నడుము చుట్టు కొలత కొలుస్తుంటే, ఆమె చెయ్యి అతని దండల గట్టిదనాన్ని, చాతీ కైవార్యాన్నీ మార్చి మార్చి అంచనా వేస్తోంది. ఎంతసేపటి నుండి ఆ లిప్‌లాక్ కొనసాగుతుందో తెలియదు కానీ... ఇద్దరిలో ఏ మాత్రం అసౌకర్యం కనపడటం లేదు.

అప్పటివరకు అలాంటి దృశ్యాలు ఇంగ్లీషు సినిమాలలో తప్ప నిజ జీవితంలో చూసి ఎరుగని నేను కట్రాటలాగా నిలబడి పోయాను.

అప్పుడు తెలియలేదు కానీ, అది అత్యంత కళాత్మకంగా తీసిన రాజ్‌కపూర్ సినిమాలోని దృశ్యంలా ఉంది.

వారి చర్యలో ఏ మాత్రం ఆవేశం లేదు. చుట్టూ ఉన్న పరిసరాలను పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. నడుము చుట్టూ బిగించిన చేయి కాక మరొక చేతితో ఆమె ముంగురులు సవరిస్తూనే అతను తన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాడు. అదే సమయంలో ఆమె అతని బుగ్గల మీద సున్నితంగా గీతలు పెడుతోంది. ఒకరికొకరికి అడ్డువస్తున్న ముక్కులను తప్పించుకోవటానికి మొహాన్ని అటుఇటూ మార్చుకోవటం తప్ప వారిలో ఏమాత్రం అలజడి లేదు. అనిర్వచనీయమయిన అనుభూతిని ఆస్వాదిస్తున్నట్లు ఒక రకమయిన వెలుగు వారి మొహాల్లో ప్రకాశిస్తోంది.



ఎవరయినా తమని గమనిస్తారేమో అని ఆలోచన కానీ, గమనిస్తే గేలి చేయబడతామేమో అన్న భయం కానీ లేదు. అలా అని వారేమీ కళ్లు మూసుకుని పరిసరాలను మరచిపోయిన స్థితిలో లేరు. హాయిగా ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటూ చేస్తున్న పనిని పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నారు. అటుఇటూ నడుస్తున్న ముంబయ్ వాసులు అదేదో మామూలు విషయం అన్నట్లు వీరిని చూసి కూడా పట్టించుకోకుండా ముందుకు నడుస్తున్నారు.

ఇంతలో వెనుక నుండి వస్తున్న నా తోటి ఇద్యార్థులు నన్ను చేరుకున్నారు. నేను చూస్తున్న దృశ్యాన్ని గమనించిన మిగిలిన పిల్లలు ఈలలు, పిల్లికూతలకు దిగే లోపు మా టీచర్లు వచ్చి అందరినీ గదమాయించి ముందుకు నడిపించారు.

అందరితో ముందుకు నడిచిన నేను మరి కాస్త దూరం వెళ్లాక వెనక్కి తిరిగి చూశాను. వారి భంగిమలో ఏ మార్పూ లేదు. అదే పారవశ్యం ఇంకా కొనసాగుతోంది.

వారి ఆ భంగిమ నా మదిలో ముద్ర కొట్టినట్లు నిలబడి పోయింది. గత 15 సంవత్సరాలలో అది చెదరలేదు సరికదా, అదొక ఫాంటసీగా మారిపోయింది.

ఎప్పటికయినా అలా బహిరంగంగా గాఢమయిన ముద్దు పొందాలన్నదే నా కోరిక. అందుకే పెళ్లి చూపుల్లోనే అందరికీ నా కోరిక గురించి చెప్పి... ‘దానికి సహకరిస్తారా?’ అని అడిగేవాడిని. కొంతమందికి అది తప్పనిపించింది. మరికొందరకి చీదర అనిపించింది. బట్ అది నా కోరిక. నా దృష్టిలో అదేమీ పెద్ద నేరం కాదు. అందుకే నేనేమీ సిగ్గు పడలేదు. చివరకు నువు దొరికావు. నా కోరిక విని నవ్వలేదు. కోపగించుకోలేదు. సింపుల్‌గా, ‘సరే...’ అన్నావు. నేను నిన్ను మనస్ఫూర్తిగా నమ్మాను. నువ్వు ఇప్పుడిలా అడుగుతుంటే నిజంగా నాకు సహకరిస్తావా, లేదా? అని అనుమానం వస్తోంది.” అంటూ సుదీర్ఘంగా చెప్పాను.

“ముద్దు పెట్టుకోవటమే నీ ఫాంటసీ అయితే అది తీరిపోయిందిగా...”

“ఇలా నాలుగ్గోడల మధ్య ముద్దు పెట్టుకోవటం ఎవరయినా చేసే పనే! నేను కోరుకున్నది అందరి మధ్యా బహిరంగంగా ముద్దు పెట్టుకోవటం...”



"మన సమాజంలో అది కుదిరే పనేనా?"

"ఇక్కడ కష్టమని నాకూ తెలుసు. అందుకే మార్గం కూడా చెప్పానుగా! ముంబయ్ లాంటి చోట అయితే మనల్ని ఎవరు పట్టించుకుంటారు?"

రమ్య నా గుండెల మీద నుండి పక్కకి జరిగి గడ్డం మీద ముద్దు పెట్టింది. "ఏ బాంధవ్యం నిలబడాలన్నా నమ్మకం ముఖ్యం. మన పెళ్లి అబద్ధాల మీద ఆధారపడటం నాకు ఇష్టం లేదు. నేను ఇచ్చిన మాట తప్పను. కానీ ఒకటే కండిషన్. నీకు ఒకరోజు సమయం ఇస్తాను. ఆ రోజు నీ ఇష్టం. రోజూ అలా చేయాలంటే నాకు కుదరదు. సరేనా?..."

"సరే!" రోజూ అది జరిగే పని కాదు కాబట్టి నేనూ ఆ కండిషన్‌కి ఒప్పుకున్నాను.

"మరి ముంబయ్ ఎప్పుడు వెళ్దాం?" అడిగింది తను.

ఆడనిమాట తప్పని వ్యక్తిత్వంలా ఆమె ముక్కు పుడుక తళుక్కున మెరిసింది.

నా చూపుల్లోని భావం అర్థం అయిందో, నా ప్రయత్నాలే ఫలించాయో ఆమెలో కూడా చలనం మొదలయింది. ఆ పెదవులు చిగురుటాకుల్లా అదురుతున్నాయి.

ముందుకు వంగి ఆ పెదవులు అందుకున్నాను.

చల్లగా వీస్తున్న ఏ.సీ. గాలి ఒక్కసారిగా వేడిగా మారినట్లయింది. తొలగిన సందేహాలు ఒకరిమీద ఒకరికి నమ్మకాన్నీ, తొలగిన వలువలు ఒకరి మీద ఒకరికి సమ్మోహాన్నీ కలుగ చేస్తుంటే, ఒకరు ఇద్దరయ్యే ప్రయత్నంలో భాగంగా ఇద్దరు ఒకటయ్యే ప్రయత్నం మొదలయింది.

మేము హనీమూన్‌కి ముంబయ్ వెళ్తున్నామని తెలిసి అందరూ పెదవి విరిచారు.

"అక్కడేముందిరా! ఆ గందరగోళపు నగరంలో మీరేం ఎంజాయ్ చేస్తారు? ఏదైనా ప్రశాంతంగా ఉండే హిల్ స్టేషన్‌కి వెళ్లవచ్చుగా?..." అన్న సలహాలను పక్కన పెట్టి మా ప్లాను ప్రకారం ముంబయ్ చేరుకున్నాం.

ఎయిర్‌పోర్టు నుండి హోటల్ చేరుకునేటప్పటికి పొద్దు పోయింది. రమ్య స్నానం చెయ్యటానికి బాత్‌రూములోకి వెళ్లింది. హోటల్ కిటికీ నుండి బయటకు చూస్తున్న నాకు రంగురంగుల దీపాల

కాంతులతో మెరైన్ డ్రైవ్ మెరుస్తూ కనిపించింది. అప్పటివరకు పడిన సన్నటి జల్లు అప్పుడే తగ్గింది. వానతో కడిగిన ముత్యంలా మరింత తళుకులీనుతోంది మెరైన్ డ్రైవ్.



ఇంతలో రమ్య బయటకు వచ్చిన శబ్దం అవటంతో వెను తిరిగి చూశాను.

అప్పుడే స్నానం చేసి 'డ్రయర్'తో ఆరబెట్టుకున్న జుట్టు స్వేచ్ఛగా ఎగురుతోంది. డార్క్ బ్లూ కలర్ జీన్స్ మీద పింక్ కలర్ షిఫాన్ టాప్ వదులుగా వేలాడుతోంది.

నెమ్మదిగా వచ్చి నా పక్కన నిలబడిన రమ్య శరీరం నుండి మత్తయిన పరిమళం నలు దిక్కులా వ్యాపిస్తోంది.

"ముంబయ్ అందాలన్నీ ఒక్కడివే ఎంజాయ్ చేస్తావా ఏంటి?" తను కూడా బయటకు చూస్తూ అంది.

"నిన్ను చూసేవరకు అలానే అనుకున్నాను. ఇప్పుడేమో అవన్నీ వద్దు, నువ్వే కావాలని అనిపిస్తోంది."

"ఆ పనులన్నీ ఎప్పుడయినా చేసుకోవచ్చు..." నడుము మీద వేసిన నా చేతిని తొలగిస్తూ అంది రమ్య. "నువు అడిగిన కోరికకి మాత్రం రేపే గడువు. అప్పటి వరకు నీ ఇష్టం. రేపు రాత్రి పన్నెండు గంటల తరువాత మాత్రం బహిరంగ ప్రదర్శనలు కుదరవు. ఏదయినా నాలుగు గోడల మధ్యే..."

"సరే! పద... అలా బయటకు వెళ్లి డిన్నర్ చేసి వద్దాం..." అన్నాను నేను.

"డిన్నర్ చేయటానికి బయటకు వెళ్లాలా?"

"ఇంత దూరం వచ్చింది ఇలా రూమ్‌లో కూర్చోవటానికి కాదు కదా..." అంటూ మొత్తానికి ఆమెను బయలుదేర తీశాను.

ఇద్దరం ఒక రెస్టారెంట్ దగ్గర ఆగాం. చుట్టూ అద్దాలతో ఉన్న ఆ రెస్టారెంట్లో ప్రతి సీటూ మెరైన్ డ్రైవ్ అందాలను ఆస్వాదించటానికి వీలుగా డిజైన్ చేయబడింది. ఇండియన్స్ కంటే ఎక్కువ ఫారినర్సే అక్కడ కనపడ్డారు నాకు. వారిని చూడగానే నాకు ఒక ఆలోచన వచ్చింది.



"ఇక్కడ డిన్నర్ చేద్దామా?" అడిగాను.

'నాకేం అభ్యంతరం లేదు...' అన్నట్లు భుజాలు ఎగరేసింది రమ్య.

లోపలకు వెళ్లి కూర్చునే లోపే నేను అనుకున్న దృశ్యాలు ఒకటి రెండు కనిపించాయి. భోజనం చేస్తున్న కొన్ని ఫారిన్ జంటలు చాలా ముద్దు పెట్టుకుని తిరిగి తినటం కంటిన్యూ చేస్తున్నారు. అన్ని టేబుల్స్ మీదా భోజనంతో పాటు డ్రింక్ గ్లాసులు ఉన్నాయి. అవి కూల్ డ్రింక్స్ మాత్రం కాదని ఆ హాలులో వ్యాపించిన వాసనలు చెప్తున్నాయి.

ఇంతలో మా బాస్ కంటే నీటుగా డ్రస్ వేసుకున్న ఒక వ్యక్తి అడక్కుండానే ఒక సీసా తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

"వాటీజ్ దిస్..." గాభరాగా అడిగాను.

"షాంపేన్ సర్..." అని నాకు అర్థం కాలేదని అనుకున్నట్లున్నాడు, "ఇది మత్తు పానీయం కదు సర్! డిన్నర్‌తో పాటు అందరూ తీసుకుంటారు." అని వివరించాడు.

అంగీకారంగా తలాడించక తప్పలేదు. దానిని రెండు గ్లాసుల్లో పోసి ఇద్దరి ముందూ పెట్టి తను వెళ్లి పోయాడు.

వాడటు వెళ్లగానే, "తీసుకో..." అన్నాను రమ్య వైపు చూస్తూ. ఎవరైనా అడిగితే లక్ష రూపాయలు పందెం కాసేవాడిని రమ్య ఆ డ్రింక్ తాగదని. మన ఆడపిల్లల మీద అంత నమ్మకం నాకు.

వెంటనే రమ్య గ్లాసు తీసుకుని నాకంటే ముందే ఒక సిప్ చేసి, మొహం వెగటుగా పెట్టి, "షాంపేన్ అంటే ఇలా ఉంటుందా?" అంది.

షాక్ నుండి తేరుకున్న నేను విరక్తిగా నవ్వాను. ఆమెకు అంతకు ముందు మందు అలవాటు లేదని ఆనందించాలో, లక్ష రూపాయల పందెం కాసి ఎవరి మీదా ఓడిపోనందుకు ఆనందించాలో అర్థం



కాలేదు. ఇంతలో రమ్య, "తీసుకో..." అంటూ నా గ్లాసు వైపు చూపించింది. నేను తీసుకోకపోతే అది కూడా తనే ఖాళీ చేస్తుందేమో అన్న భయంతో నా గ్లాసు నేనే ఖాళీ చేశాను.

అదీ ఒకందుకు మంచిదే అయింది. అంతకు ముందు లేని ధైర్యం ఏదో ఇంజెక్ట్ చేసిన ఫీలింగ్ కలిగింది. ఇంతలో ఆర్డర్ చేసిన డిన్నర్ వచ్చింది. డిన్నర్ తింటూ ఇద్దరం కలిసి షాంపేన్ బాటిల్ ఖాళీ చేశాము. అప్పటికే బాగా పొద్దు పోయింది. నా ఎదురుగా ఉన్న టేబుల్ మీద జంట డిన్నర్ ముగించి లేచి వెళ్లబోతూ ఒక ముద్దు గాఢంగా మాకు అంకితం ఇచ్చి వెళ్లారు. అది చూసి ఇక నేను ఆగలేక పోయాను. రమ్య వైపు తిరిగి సైగ చేశాను. కొన్ని క్షణాలు తటపటాయించినా నాకిచ్చిన మాట గుర్తుకు వచ్చిందనుకుంటా రెప్పలాడించి అంగీకారం తెలిపింది.

అంతకుముందు చూసిన జంటని ఆదర్శంగా తీసుకుని టేబుల్ మీద చేతులు ఆనించి పెదాలు బాగా చాపి ముందుకు ఒంగాను. అయితే రమ్య అందలేదు. ఆమె కూడా ముందుకు వంగితే అనువుగా ఉంటుంది. కానీ, ఇప్పుడు ఆ మాట ఆమెను అడగటం కంటే నేనే కాస్త ముందుకు జరగటం ఉత్తమం అనిపించి అలా చేశాను. అయితే టేబుల్ మీద మరీ ఎక్కువ బలం వేస్తున్నానని గుర్తించలేదు. ఆ సంగతి తెలిసేటప్పటికి బాగా ఆలస్యం అయింది. టేబుల్ మొత్తం నా పక్కకి ఒరగటం, దాని మీద ఉన్న పదార్థాలూ, ద్రవాలూ నా మీద పడటం ఒక్క క్షణంలో జరిగి పోయాయి.

దారుణమయిన నిశ్శబ్దం ఆ రెస్టారెంటంతా అలముకుంది. అయితే అది కాసేపే. తరువాత ఆ హాలంతా ముసిముసి నవ్వులతో నిండి పోయింది. ఆ ముసిముసి నవ్వులు వికటాట్టహాసాలు కాకముందే రమ్యా, నేనూ అక్కడనుండి బయటపడి మా హోటల్‌కి చేరుకున్నాం.

అవమానంతో చాలాసేపు అసహనంగా గడిపాను నేను. రమ్యే ఓదార్చింది. "నీ తప్పేం ఉంది. షాంపేన్ తాగితే మత్తు ఎక్కదన్నాడు కానీ, బాగా మత్తుగానే ఉంది. అందుకే అలా అయిందిలే. అయినా రేపంతా సమయం ఉందిగా..." అంటూ నాలో కాన్ఫిడెన్స్ నింపింది.



ఆ రాత్రి రమ్యని దగ్గరకు తీసుకుంటే ఆమె దగ్గరనుండి ఎప్పుడూ వచ్చే పరిమళం రాలేదు. షాంపేన్ వాసనే వచ్చింది. ఆరు బయట సంగతి పక్కన పెడితే నాలుగు గోడల మధ్యన కూడా ముద్దు పెట్టుకోబుద్ధి కాలేదు. నా ఫాంటసీ గోలతో అసలు ఆనందం మిస్ అవుతున్నానేమో అన్న అనుమానం వచ్చింది. కానీ... ఇంత దూరం వచ్చాము కాబట్టి రేపు ఒక్క రోజు ప్రయత్నించటంలో తప్పు లేదని నన్ను నేను సముదాయించుకుని నిద్ర పోయాను.

మరుసటి రోజు ఎంతో ఆలోచించి నా ఫాంటసీకి మూలమయిన అంధేరీ ఫుట్ఓవర్ బ్రిడ్జి దగ్గరకు వెళ్లి నా కోరిక తీర్చుకుందామని నిర్ణయించుకున్నాను.

ఎప్పుడో 15 సంవత్సరాల క్రితం చూసిన బ్రిడ్జి ఇప్పుడు పూర్తిగా మారి పోయింది. అక్కడ ముద్దు పెట్టుకోవటానికి కాదు కదా, నిలబడటానికి కూడా వీలు కావటం లేదు. ఒక్క క్షణం మధ్యలో ఆగినా జనం మన ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా తోసుకు పోతున్నారు. ఏదైనా ట్రైన్ వచ్చి ఉంటుంది, అందుకే ఇంత రష్ అని సర్ది చెప్పుకున్న నాకు, ఆ స్టేషన్‌కి ప్రతి రెండు నిమిషాలకీ ఒక లోకల్ ట్రైన్ వస్తుందని తెలిసి నిర్వేదం కలిగింది.

"జుహు బీచ్ దగ్గర్లోనే ఉంటుందంట..." అని అన్యాపదేశంగా సలహా ఇచ్చింది రమ్య.

అంతకంటే చేసేదేం లేక అక్కడకే బయలుదేరాం. పగటి సమయం కాబట్టి అంతగా జనం లేరు. మా అవతారాలు చూసి వాళ్లకేం అర్థమయిందో కానీ... అన్ని రకాల వస్తువులు అమ్మేవారూ మా చుట్టే తిరగటం మొదలు పెట్టారు. అందులో ఒకరిద్దరి దగ్గర పల్లీలు, ఐస్‌క్రీమ్ లాంటివి కొనటం అనే దారుణమయిన పొరపాటు చేయటంతో మిగిలిన వారందరూ మా చుట్టే గుమి కూడారు. ఇద్దరం ఎదురెదురుగా నిలబడి కళ్లలో కళ్లు పెట్టి చూసుకుందామంటే, కుదర నివ్వకుండా ఏ పుచ్చకాయలమ్మేవాడో, పనస తొనలమ్మేవాడో మా చుట్టూనే తిరుగుతున్నారు.

"పోనీ దూరంగా వెళ్దామా?" జన సంచారం పెద్దగా లేని వైపు చూపించి అంది రమ్య.

అది నా కోరికకి విరుద్ధమయినా 'సరే!' అనక తప్పలేదు.



జన ప్రవాహానికి కొద్ది దూరంగా నడిచామో లేదో, ఒక పోలీసు 'ఇక్కడకు ఎందుకు వచ్చారంటూ...' ప్రత్యక్షమయ్యాడు. అతనికి ఎంత చెప్పినా వంద ఇస్తే తప్ప కన్విన్స్ కాలేదు. వంద తీసుకుని కూడా తిరిగి మమ్మల్ని జనం ఉన్న ప్రదేశానికి చేర్చి కానీ అతను శాంతించలేదు.

అంతేకాదు ఆ తరువాత చౌపాటీ బీచ్, ఎలిఫెంటా కేవ్స్, గేట్ వే ఆఫ్ ఇండియా లాంటి చోట్ల తిరిగి చూశాం కానీ మా ప్లాను అమలు చెయ్యటం ఎక్కడా కుదర లేదు. కుదరకపోవటం కూడా కాదు, మనసుకు నచ్చలేదు. సమయం గడిచే కొద్దీ నా ఆందోళన పెరిగిపోసాగింది – నా కోరిక అసలు తీరదేమో అని. ఇక ఎక్కడో ఒక చోట పని ముగించాలని అనుకుంటున్న నా ఆలోచనల మధ్య సడన్ బ్రేక్‌తో ట్యాక్సీ ఆగింది. ఏమి జరిగిందో నేను గమనించలేదు కానీ... నేను ప్రయాణిస్తున్న ట్యాక్సీ రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుద్దిందని మాత్రం అర్థమయింది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి విపరీతమయిన రక్తస్రావంతో కుప్పకూలి పోయాడు.

మా ట్యాక్సీ డ్రైవర్ ట్యాక్సీని వదిలేసి కన్ను మూసి తెరిచే లోపు అక్కడ నుండి మాయమయి పోయాడు.

జనం గుమి కూడుతున్నారు తప్ప ఎవరూ సహాయం చేసే ప్రయత్నం చేయటం లేదు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి ఒక ఫోన్ చేసి తన పని అయిపోయినట్లు పక్కకి వెళ్ళి పోయాడు.

ఇక నేను సహించలేక పోయాను. వారిస్తున్న వారెవరినీ పట్టించుకోకుండా గాయపడిన వ్యక్తిని ట్యాక్సీ వెనుక సీటులోకి చేర్చి నేనే డ్రైవ్ చేసుకుంటూ దగ్గరలోని హాస్పిటల్‌కు తీసుకు వెళ్లాను.

50 వేలు కడితే తప్ప వైద్యం చేయటం కుదరదన్నారు హాస్పిటల్లో. సమయానికి నా క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్ ఉండబట్టి ఆ గండం గడిచింది.



అతని బ్లడ్ గ్రూప్ ఏ.బి. నెగిటివ్ అని తేలింది. అది వాళ్ల బ్లడ్ బ్యాంక్‌లో లేదన్నారు. అదృష్టం కొద్దీ నా బ్లడ్ గ్రూప్ అదే కాబట్టి మరో ఆలోచన లేకుండా ముందు నా బ్లడ్ ఇచ్చాను.

రమ్య ఆ వ్యక్తి జేబులో దొరికిన ఫోన్ నెంబర్‌ని కాంటాక్ట్ చేసింది.

నేను రక్తం ఇచ్చే కార్యక్రమం పూర్తి చేసి బయటకు వచ్చాను.

అప్పటికే డాక్టర్లు అతనికే ప్రమాదం లేదని డిక్లేర్ చేశారు. ఈలోపు గాయపడిన వ్యక్తి భార్యాపిల్లలు వచ్చారు. వారు సరాసరి వచ్చి నా కాళ్ల మీద పడబోయారు. వారించినా వినలేదు. వారి ఆర్థిక పరిస్థితికి ఇంత ఖర్చు చేసి వైద్యం చేయించటం సాధ్యం అయ్యే విషయం కాదని నాకు అర్థం అయింది. నాకే సంబంధమూ లేకపోయినా నేను డబ్బులు కట్టిన విషయం అందరికీ తెలిసినట్లు ఉంది. అందరూ వచ్చి అభినందిస్తున్నారు.

వారందరినీ తప్పించుకుని రమ్య దగ్గరకు నడిచాను. తను కూడా పూర్తిగా అలిసిపోయి ఉంది. మొహం అంతా వాడిపోయి నీరసంగా ఉంది. ఆమెను అలా చూసి, "అయామ్ సారీ రమ్యా..." అన్నాను.

"ఇందులో నువ్వు చేసింది ఏముంది? ఇంకా చెప్పాలంటే ఒక మనిషి ప్రాణం కాపాడావు..." అంది.

ఆమె మాటల్లో ఏమన్నా వెటకారం ధ్వనిస్తుందేమో అని అనుమానం వచ్చింది. కానీ అది నిజం కాదు. ఆమె మొహంలో నా మీద ఏదో తెలియని ఆరాధన కనిపించింది.

ఇక అక్కడ ఉండటం అనవసరం అనిపించింది. "ఇక వెళ్దామా రమ్యా?" అన్నాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. నిద్రలో నడిచినట్లు రెండడుగులు ముందుకు నడిచి మునికాళ్ల మీద నిలబడి రెండు చేతులతో నా తలను తన చేతుల్లోకి తీసుకుని తన పెదవులతో గాఢంగా నా పెదవులను బంధించింది.

ఒక్క క్షణం నాకేమీ అర్ధం కాలేదు.



నేనే కదు, అనుకోని ఆ సంఘటనకు హస్పిటల్లోని డాక్టర్లు, నర్సులు, స్టాఫూ, పేషంట్లూ అందరూ ఆశ్చర్య పోయారు.

ముసిముసి నవ్వులతో మమ్మల్నే చూస్తున్న వారందరినీ గమనించిన నేను రమ్యను దూరంగా జరపబోయాను. కానీ ఆమె నా చర్యల్ని పట్టించుకోలేదు. నా మొహాన్ని మళ్ళీ దగ్గరకు లాక్కొని తన ముద్దు కొనసాగించింది.

ఆ ముద్దులో కోరిక లేదు...

అభినందన ఉంది.

ఆత్మీయత ఉంది.

లక్ష మంది చూస్తున్నా సిగ్గుపడనవసరం లేని తిరుగుబాటుతనం ఉంది.

భర్త కోరిక తీర్చాలన్న తాపత్రయం ఉంది.

అలా ఎంతసేపు ఉన్నామో తెలియదు. చుట్టూ చేరిన వారు గట్టిగా చప్పట్లు కొట్టటంతో మైకం నుండి బయట పడ్డాం. అప్పటికి కూడా మేము దూరంగా జరగ లేదు. ఒకరిని ఒకరం ఆత్మీయంగా చూసుకుని మరొకసారి గట్టిగా ముద్దు పెట్టుకుని విడివడ్డాం.

అప్పుడు కొట్టింది గడియారం పన్నెండు గంటలు.

అలా తీరింది నా ఫాంటసీ.

సమాప్తం